క్లుప్తంగా

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని ఆలయంలో ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు చంద్రశేఖర స్వామికి అభిషేకాలు

రంగంపేట: చంద్రేడులో కొలువై ఉన్న శ్రీకాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి వారికి సోమవారం ఘనంగా అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కష్ణ శర్మ తెలిపారు. మాసశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 4 గంటల నుంచి అభిషేకాలు ప్రారంభమవుతాయని, అనంతరం భక్తుల పేరిట ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

సహస్ర కలశ పూజలకు ఏర్పాట్లు పూర్తి


కొంకుదురులో సహస్ర కలశ పూజలకు ఏర్పాట్లు చేస్తున్న కమిటీ సభ్యులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడితలమామిడి వద్ద ఉన్న బాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వర స్వామి ఆలయం వద్ద సహస్ర కలశాభిషేక పూజలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పల్గుణ శుద్ధ మాసశివరాత్రి సోమవారం సందర్భంగా అర్చకులు రమణ శర్మ, భాస్కర్ శర్మల ఆధ్వర్యంలో వారణాసి నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన 1148 సహస్ర కలశాలకు శాస్త్రోక్తమైన సంప్రోక్షణ పూజ చేస్తామన్నారు. కొంకుదురు పరిసర గ్రామాల నుంచి 1148 దంపతులు పూజ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

శ్రీరామనవమికి కోటి తలంబ్రాలు


జి.మామిడాడలో కోటి తలంబ్రాలను గోటితో ఒలుస్తున్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడ కోదండరాముని ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 30న జరిగే సీతారాముల కల్యాణానికి కోటి తలంబ్రాలు సిద్ధమవుతున్నాయి. భక్తులు కోటి తలంబ్రాలు గోటితో ఒలిచే ప్రక్రియ కొనసాగుతుంది. ముక్కోటి ఏకాదశి రోజున ప్రారంభించిన ఈ కార్యక్రమం ఈ నెల 29వ తేదీతో పూర్తవుతుందని ఆలయ కమిటీ ప్రతినిధి అప్పారెడ్డి చెప్పారు. అదే రోజున కోటి తలంబ్రాలతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. అనంతనం 30న జరిగే శ్రీరాముని కల్యాణంలో కోటి తలంబ్రాలు వినియోగిస్తారు.

ఘనంగా సత్తెమ్మ జాతర

బిక్కవోలు: మండలంలోని ఎఫ్‌సీఐ గోదాం వద్ద ఉన్న సత్తెమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు


మాట్లాడుతున్న ఫాదర్ జోసఫ్ తంబీ

మధురపూడి: కోరుకొండ ఎస్సార్ నగర్ ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం పునీత జోజప్ప మహోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ జోసఫ్ తంబీ మాట్లాడుతూ శ్రమల కాలం క్రైస్తవులకు అత్యంత ప్రధానమైన రోజులన్నారు. ఈనెల 21 వతేదీన చర్చి ఆధ్వర్యంలో నిర్వహించే 14 పుణ్యస్థలాల దర్శనార్థం తరలిరావాలన్నారు. ఉపదేశి బెల్లపు డేవిడ్, మేరీ విజయ, సంఘపెద్దలు ఆంథోని, నీలిమా స్వర్ణాంజలి పాల్గొన్నారు.

ఆసరాతో ఆడపడుచులకు ఆర్థిక భరోసా

- మూడో విడత రుణమాఫీకి రంగం సిద్ధం
- 25న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి


పందలపాకలో డ్వాక్రా సంఘాల సభ్యులు

బిక్కవోలు: మహిళల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుంది. 2019 ఏప్రిల్ 11 నాటికి డ్వాకా సంఘాల సభ్యులకు ఎంతెంత రుణముందో అదంతా దశల వారీగా మాఫీ చేస్తానని ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఏటా ఆసరా పేరుతో వారి ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా వంటి కష్టకాలంలోనూ ఆసరా సొమ్ములు అందించారు. ఇప్పటికే రెండు విడతలు పూర్తవ్వగా ఈ నెల 25న మూడో విడత సొమ్ము విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతుంది. ఈ ఏడాది కూడా ఆసరా పథకంలో భాగంగా డ్వాకా యానిమేటర్లతో లబ్ధిదారుల బయోమెట్రిక్‌లను సేకరిస్తున్నారు.

పూర్తయిన వివరాల సేకరణ

ఆసరా పథకం మూడో విడత అమలుకు సంబంధించి లబ్ధిదారుల వివరాల సేకరణ వైఎస్సార్ వెలుగు సిబ్బంది ఇప్పటికే పూర్తి చేశారు. గత రెండేళ్లుగా ఆసరా సొమ్ములు తీసుకుంటున్న లబ్ధిదారులు జీవించి ఉన్నారో లేదో రూడీ చేసుకుని, అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకున్నారు. అర్హత కలిగి ఉండి ఎవరైనా ఏడాది లోపు మరణించి ఉంటే వారి నామినీకి సొమ్ము చెల్లించే విధంగా వివరాలు నమోదుచేశారు.

అనపర్తి నియోజకవర్గంలో 5,437 డ్వాక్రా సంఘాలకు గాను రూ. 50,07,30,705, రాజానగరం నియోజకవర్గంలో 5,285 సంఘాలకు గాను రూ.45,28,86,614 చొప్పున ఇప్పటికే రెండు విడతలు సొమ్ములిచ్చారు. ఈ ఏడాది మూడో విడతగా ఆసరా ఆర్థిక సాయం అందించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 25వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా సొమ్ములు విడుదల కానున్నాయి.

ఆసరా పథకం ద్వారా మూడో విడత రుణమాఫీ వివరాలు

మండలం	లబ్ధి పొందిన సంఘాలు	మూడో విడత జమ కానున్న సొమ్ము (రూపాయిల్లో)
అనపర్తి	1,310	11,77,15,911
బిక్కవోలు	1524	14,39,12,199
రంగంపేట	1,165	9,21,95,856
పెదపూడి	1,438	14,69,06,739
రాజానగరం	2,089	17,01,72,026
సీతానగరం	1,629	13,93,55,674
కోరుకొండ	1,567	14,33,58,914
మొత్తం	10,722	95,36,17,319

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



ఆసరా పథకం ద్వారా మా గ్రూపుకి ఇప్పటికే రెండు విడతల్లో కలిపి రూ.6,94,112 రుణమాఫీ చేశారు. మూడో విడతగా రూ.1,73,528 నగదు జమవ్వనుంది. మా సంఘం ఆర్థిక ఎదుగుదలకు కారణమైన ముఖ్యమంత్రి జగన్ బాబుకు రుణపడి ఉంటాం.

– బసవా విజయకుమారి, లబ్ధిదారు, రామేశ్వరం

బయోమెట్రిక్‌ల సేకరణ పూర్తి



ఆసరా పథకంలో లబ్ధి పొందిన సభ్యులకు మూడో విడత బయోమెట్రిక్‌ల సేకరణ పూర్తయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నెల 25న నేరుగా వారి ఖాతాల్లో నగదు జమవుతుంది.

– చిన్నబాబు, వైఎస్సార్ క్రాంతి పథకం, ఏపీఎం, పెదపూడి

అకాల వర్షంతో అవస్థలు


కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో వాన నీరు


దివాన్‌చెరువు కూడలి నుంచి శ్రీరామపురం వెళ్లే రహదారిపై ముంపునీరు

మధురపూడి: అకాల వర్షానికి కోరుకొండ మండలంలోని లోతట్టు గ్రామాలు, ప్రధాన కూడళ్లు నీటమునిగాయి. కోరుకొండ బస్టాండ్ సెంటర్ నీటితో నిండిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. అలాగే మురుగునీటి కాలువలు పొంగిపొర్లాయి. కాలువల్లో చెత్తను పారిశుధ్య కార్మికులు హుటాహుటిన తొలగించి, నీరు ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు.

రహదారి జలమయం

రాజానగరం: దివాన్‌చెరువు జంక్షన్ నుంచి శ్రీరామపురం వెళ్లే రహదారి కొద్దిపాటి వర్షానికే జలమయమవుతోంది. రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షానికి ఈ ప్రాంతంలో కాలువను మరిపించేరీతిలో ముంపునీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా పక్కా డ్రైనేజీని ఏర్పాటు చేసి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను స్థానికులు కోరుతున్నారు.

ముంపు సమస్యకు బైబై..


గతంలో ముగ్గళ్ల ఎస్సీ పేటలో ముంపునీరు


నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేశాక..

సీతానగరం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఉదాహరణకు ముగ్గళ్ల ఎస్సీపేట కాలనీ గేటు రోడ్డును ఎంపీపీ నిధులతో సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. దీంతో రెండు రోజులుగా వర్షం కురుస్తున్నా ఈ రోడ్డు ముంపబారిన పడలేదు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వం ఎస్సీపేటలను నిర్లక్ష్యం చేసింది. కొద్దిపాటి వర్షానికే ఈ వీధిలో నీరు నిలిచేది.

నగరాభివృద్ధికి రౌతు విశేష కృషి


పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యేగా (2004 - 2014) రౌతు సూర్యప్రకాశరావు నగరాభివృద్ధికి విశేష కృషి చేశారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. రౌతు సాధించిన విజయాలపై రూపొందించిన 'చట్ట సభలలో గోదావరి గళం' పుస్తకావిష్కరణ ఆదివారం కొత్తపేట రౌతు తాతాలు కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ రౌతు సూర్యప్రకాశరావు ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు సభ్యుడిగా ఒక గుర్తింపు తెచ్చుకున్నారని, మంచి మనిషిగా, మంచి నాయకుడిగా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. రాష్ట్ర విభజన అంశంపై మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌పై యూపీఏ, ఎన్డీఏ ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తూడడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ అన్యాయంగా విడదీసిందని అందుకే రాష్ట్రంలో ఆ పార్టీ తుడుచు పెట్టుకుపోయిందన్నారు. ప్రస్తుతం బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉండటంతో మన ఎంపీలు ఏమీ చెప్పినా, కోరినా అరణ్య రోదనగానే మిగిలిపోతోందన్నారు. అయినప్పటికీ లోక్‌సభ, రాజ్యసభల్లో అవకాశం, సమయం వచ్చినప్పుడల్లా మన రాష్ట్ర ప్రజల వాణి వినిపిస్తూనే ఉన్నామన్నారు. రాష్ట్ర విభజనకు సంబంధించి ప్రైవేట్ బిల్లును వైఎస్సార్ సీపీ లోక్‌సభకు సమర్పించడం జరిగిందని, త్వరలోనే చర్చకు వస్తుందన్నారు. ప్రత్యేక హోదా విషయంపై పార్టీలకు అతీతంగా పోరాడాలని పిలుపు నిచ్చారు.


సభలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

తరలివచ్చిన ప్రముఖులు

రౌతు సూర్యప్రకాశరావు దశాబ్దం పాటు తన గళాన్ని శాసనసభలో ప్రస్తావించిన సమస్యలను శ్రీపాద శ్రీనివాస్ కూర్పుచేసి 'చట్టసభల్లో గోదావరి గళం' పేరుతో పుష్కకాన్ని రూపొందించారు. ఈ పుస్తకావిష్కరణకు పార్టీలకు అతీతంగా ప్రముఖులు తరలివచ్చారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులను రౌతు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, ప్రముఖ మానసిక వైద్యనిపుణులు కర్రి రామారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ప్రముఖ నాట్యాచారుడు సప్పా దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పంతం కొండలరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, బీజేపీ నాయకులు యెనుమూరి రంగబాబు, అడబాల రామకృష్ణ, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వీరన్న దంపతులకు సత్కారం


వీరన్న దంపతులను సత్కరిస్తున్న సర్పంచ్ శ్యామలావతి దంపతులు

రంగంపేట: వడిశలేరులో శ్రీదేవి-భూదేవి సమేత శ్రీభజేనారాయణస్వామి ఆలయంలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరామ అఖండ భజన సప్తాహ మహోత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రంగంపేట గ్రామానికి చెందిన శ్రీదేవి బాల భక్త భజన సమాజం గురువు పోతుల వీరన్న దంపతులను వడిశలేరు గ్రామ సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్ దంపతులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. అనంతరం సప్తాహ భజన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన భగవద్గీత, లలితా, శారద మహిళా భజన సమాజ బృందాలకు ఆలయ కమిటీ చైర్మన్ మావిరెడ్డి వీర్రాజు, దేవస్థానం కార్య నిర్వాహక కార్యదర్శి ముమ్మన రాంబాబురెడ్డిలు బహుమతులు ప్రదానం చేశారు.

ఘనంగా వేగుళ్లమ్మ అమ్మవారి సంబరం


మిర్తిపాడులో వేగుళ్లమ్మ అమ్మవారి పొంగు


ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

సీతానగరం: మండలంలోని మిర్తిపాడులో వేగుళ్లమ్మ అమ్మవారి సంబరం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలు, కోలాటం, దేవతామూర్తుల వేషధారణ నడుమ బాణసంచా కాల్పులతో వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ గృహసారథి జొన్నలగడ్డ సత్యనారాయణ నివాసం వద్ద అమ్మవారి పొంగు నిర్వహించారు. వేగుళ్లమ్మ సంబరం కమిటీ ఆధ్వర్యంలో రాత్రి 10 గంటల వరకు అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

వడ్డీ ఎర... అసలుకు చెర

- మోసం చేస్తున్న ప్రబుద్ధులు
- అప్పు ఇచ్చిన వారికి తప్పని శోకం
- పెరుగుతున్న ఘటనలు


కడియంలో జయరామ్ చేసిన మోసాన్ని డీఎస్పీకి వివరిస్తున్న బాధితులు (ఫైల్)

కడియం: నర్సరీలో కూలి పనులు చేసుకునే వారు కొందరు.. పువ్వులు కట్టి రూపాయి రూపాయి పోగేసుకున్నవారు ఇంకొందరు.. చిరుద్యోగులు మరికొందరు..నోరు కట్టుకుని డబ్బులు పోగేసుకుని తెలిసిన వాళ్లకు అప్పుగా ఇస్తే ఆ వడ్డీతో కుటుంబానికి అదనపు ఆదాయం వస్తుందన్న ఆశ.. అయితే వీరి ఆశను, నమ్మకాన్ని పెట్టుబడిగా భావించి మోసం చేయడానికి సిద్ధంగా ఉంటున్నారు ఇంకొందరు. వీరికి బాధితుల కష్టం గానీ, తాము తీసుకున్న డబ్బుతో బాధితుల జీవితాలకు ముడిపడి ఉండే కుటుంబ, సామాజిక అంశాలు గానీ అనవసరం. నమ్మకంగా అప్పు తెచ్చుకోవడం ఆ తరువాత ఎగ్గొట్టేయడం. ఇదే తరహా మోసాలు ఇటీవలి కాలంలో కడియం మండలం పరిధిలో పెరిగిపోతున్నాయి.

వ్యాపారం కోసమని..

సాధారణంగా ఏదో ఒక వ్యాపారాన్ని పెట్టి, దానిని భారీ ఎత్తున విస్తరిస్తున్నారు. తద్వారా పలువురి దృష్టిని ఆకర్షిస్తున్నారు. వ్యాపారంలో పెట్టుబడి అంటూ అప్పు రూపంలో డబ్బులు పోగేస్తున్నారు. ఆ తర్వాత ముఖం చాటేస్తున్నారు. వడ్డీకి ఆశపడి అప్పులు ఇచ్చిన వాళ్లు గొల్లుమని నెత్తీనోరూ బాదుకుంటూ పోలీస్‌స్టేషన్ గడప తొక్కుతున్నారు. తీరా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తే రుణాలు ఎగ్గొట్టిన వాళ్ల పేరిట సెంటు భూమి కూడా ఉండడం లేదు. ఇలా ఉద్దేశ పూర్వకంగా మోసం చేసేవాళ్లు కొందరైతే, చేస్తున్న వ్యాపారాల్లో దెబ్బతిని కోలుకోలేని వారు ఇంకొందరు కూడా రుణాలు ఎగ్గొట్టే బాటనే ఎంచుకుంటున్నారు. ఇటువంటి వారు ముందుగానే ప్రణాళిక ప్రకారం ఐపీ నోటీసులు కూడా ఇచ్చి తమపైకి ఎటువంటి ఉపద్రవాలు రాకుండా జాగ్రత్తలు కూడా పడుతున్నారంటున్నారు. చట్ట ప్రకారం కేసులు నమోదు చేసినప్పటికీ మోసగాళ్లకు శిక్షలు పడుతున్నాయి తప్పితే బాధితులకు కోల్పోయిన డబ్బుకు మాత్రం న్యాయం జరగడం లేదు.

బాధితుల ఆవేదన

మండల కేంద్రమైన కడియంలో ఇటీవల వెలుగు చూసిన జయరామ్ ఎలక్ట్రికల్స్ అధినేత ధనుంజయరావు అలియాస్ జయరామ్ విషయంలోనూ ఇదే తరహా మోసం జరిగిందని బాధితులు వాపోతున్నారు. రాజానగరం వద్ద భూములు కొని ప్లాట్లు వేసి అమ్మితే లాభాలు భారీగా వస్తున్నాయని.. తద్వారా అధిక వడ్డీలు ఇస్తానని నమ్మబలికాడని చెబుతున్నారు. జయరామ్ మాటలు నమ్మి ఒకరికి తెలియకుండా మరొకరు కోట్లాది రూపాయలను అప్పుగా ఇచ్చేశారు. ఇలా ఇచ్చిన వారిలో అత్యధికులు అతడి బంధువులు, స్నేహితులే కావడం గమనార్హం. తీరా ఇప్పుడు చూస్తే ఆ భూములు మాట పక్కన పెడితే జయరామ్ పేరిట కూడా ఎటువంటి ఆస్తులు లేకుండా ముందు జాగ్రత్త పడ్డాడని తెలుస్తోంది. పలువురి నోట్లు కూడా గడువు తేదీలు దాటిపోతుండడంతో బాధితుల ఆందోళన మరింతగా పెరుగుతోంది. దీంతో తాము ఇచ్చిన అప్పు తిరిగి రాబట్టుకోవడం ఎలాగో అర్థం కాక కన్నీటి పర్యంతమవుతున్నారు. సెంటు రూ. రెండు, మూడు లక్షలు కూడా చేయని భూమిని రూ.పది లక్షలు పలుకుతుందని, డబ్బులు ఇవ్వలేను గానీ, ఆ భూమిని రాస్తానంటూ బేరసారాలు సాగిస్తున్నాడంటున్నారు. అయితే తాము ఇచ్చిన అప్పులు పదోవంతు కూడా విలువ చేయని భూమిని తీసుకుని తామేం చేయాలని బాధితులు తలలు పట్టుకుంటున్నారు.

వెలుగులోకి పలు ఘటనలు

కాగా జయరామ్ కేసు తాజాగా బయటపడింది కానీ, కడియం మండలం పరిధిలో పలు గ్రామాల్లో ఇటువంటి కేసులు ఉన్నాయని పలువురు చెబుతున్నారు. ఇటీవలే కడియం మండలం వేమగిరి గ్రామానికి చెందిన ఒక మహిళ ఇదే విధంగా చుట్టుపక్కల వారు, తెలిసిన వారి నుంచి అప్పులు తీసుకుంది. ఆ తరువాత తానివ్వలేని తేల్చేసింది. మురమండ గ్రామానికి చెందిన ఒక కిరాణా వ్యాపారి కూడా ఇదే విధంగా డబ్బులు ఇవ్వలేనని చేతులెత్తేశాడు. దుళ్ల, వీరవరం, లంక గ్రామాల్లో కూడా పలువురు ఇదే రీతిలో రుణదాతలకు ముఖం చాటేస్తున్నవాళ్లు ఉన్నారు. వీటిలో అత్యధికం పోలీసుల దృష్టికి రావడం లేదని తెలుస్తోంది. విషయం బయటకు తెచ్చి రోడ్డున పడితే తమకు అందాల్సిన డబ్బులు రాకుండా పోతాయేమోనన్న ఆందోళన బాధితుల్లో కనిపిస్తోంది. వడ్డీలకు ఆశపడి ఇలా ప్రైవేటు వ్యక్తులకు రుణాలు ఇచ్చి మోసపోయేకంటే.. నమ్మకమైన ప్రభుత్వ పెట్టుబడి పథకాల్లో పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

పండితులకు సత్కారం

బిక్కవోలు: మండలంలోని గోలింగేశ్వరస్వామి ఆలయ పండితులను ఆదివారం ఘనంగా సత్కరించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ పండితుల సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామలింగ భాస్కర్, బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మినేని నాగశ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

సీతానగరం: చినకొండేపూడి పంచాయతీ పరిధిలోని పెదకొండేపూడిలో సీతానగరం, రఘుదేవపురం, చినకొండేపూడికి చెందిన ఏడుగురు పేకాట ఆడుతుండగా అరెస్టు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ 7,360 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

యువకుల మధ్య ఘర్షణ

అనపర్తి: ఇరువర్గాల మధ్య ఘర్షణలో ముగ్గురు యువకులు గాయాలబారిన పడిన సంఘటన ఆదివారం అనపర్తిలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దుప్పలపూడికి చెందిన సీహెచ్ గణపతి అతడి మిత్రులు దివాకర్, శ్రీతేజలు ఆదివారం సాయంత్రం దుప్పలపూడి నుంచి అనపర్తి వస్తున్నారు. వివేకానంద సెంటర్ సమీపంలో విజయ్ అనే మరో యువకుడితో ఏర్పడిన ఘర్షణ కొట్లాటకు దారి తీసింది. ఇది గమనించిన విజయ్ స్నేహితుడు ఎం.నగేష్ అక్కడకు చేరుకుని వారిని విడదీస్తుండగా దివాకర్ అతడిని కరిచి గాయం చేయడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. దాడిలో గణపతి, దివాకర్‌లు తీవ్రంగా గాయపడ్డారంటూ వారిద్దరినీ వారి స్నేహితులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు చాతీపై గాయమైన గణపతికి తొమ్మిది కుట్లు, దివాకర్‌కు కంటిపై రెండు కుట్లు వేశారు. గణపతిపై ఎవరూ దాడి చేయలేదని, తనపై కేసు పెడతారనే ఉద్దేశంతో తనకు తానే బ్లేడుతో చాతీపై కోసుకున్నాడని విజయ్ చెబుతున్నాడు. దివాకర్, గణపతిలు మత్తులో ఉన్నారని స్థానికులంటున్నారు. అయితే యువకులు గంజాయి తాగి ఉండొచ్చొనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ పి.అప్పారావు ఆసుపత్రికి చేరుకుని ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాస్తవాలు తెలుసుకునేందుకు విచారణ చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

లేపాక్షిలో డిస్కౌంట్ సేల్

సీటీఆర్‌ఐ: ఆంధ్రప్రదేశ్ హస్తకల అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలోని లేపాక్షి ఎంపోరియంలో భారీ డిస్కౌంట్‌తో వస్తువుల విక్రయాలు జరుగుతున్నాయని నగర మేనేజర్ ఎ.కార్తిక్ కుమార్ తెలిపారు. ఎంపిక చేసిన వస్తువులపై 10 శాతం నుంచి 40 శాతం వరకూ భారీ డిస్కౌంట్లు ఇస్తామన్నారు. ఈ నెల 31వ తేదీ వరకూ డిస్కౌంట్ ఉంటుందన్నారు.

మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి

ప్రకాశం నగర్: స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి నిర్వహించారు. స్వరాజ్యం చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం అరాచకాలకు, భూస్వాములకు వ్యతిరేకంగా రైతాంగాన్ని, కార్మికులనుసమీకరించి తుపాకీ పట్టి పోరాడిన వీరనారి మల్లు స్వరాజ్యమని గుర్తు చేశారు.